సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 18 । మే । 2025



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది తరలిరాగా.. ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. 8లో ▸



కొనసాగుతున్న ధర్నా

సోమవరప్పాడులో కోకో రైతులు చేపట్టిన ధర్నా రెండో రోజూ కొనసాగింది. కోకో గింజలకు ధర పెంచాలని రైతులు నినదించారు. 8లో ▸



బ్రహ్మోత్సవ శోభ

జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. 19 నుంచి ఉత్సవాలు జరుగనున్నాయి. 8లో ▸

విద్యుత్ రాయితీ అందేనా..!

ఊసే ఎత్తని కూటమి

- నాన్ ఆక్వాజోన్‌కు సబ్సిడీ ఇస్తామన్న కూటమి నేతలు
- ఏడాది కావస్తున్నా కార్యరూపం దాల్చని హామీ
- జిల్లాలో 1.28 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు
- నాన్ ఆక్వాజోన్‌లో సుమారు 9 వేల ఎకరాలు
- రాయితీ కోసం రైతుల ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో ఆక్వారంగానికి పెద్దపీట



భీమవరం ప్రాంతంలో సాగువుతున్న రొయ్యల చెరువు

సాక్షి, భీమవరం: ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌తో నిమిత్తం లేకుండా రైతులందరికీ యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఆక్వా సమస్యల పరిష్కారం కోసం సాగు సమ్మెకు సిద్ధమైన ఆక్వా రైతులు ఈ హామీని అమలు చేయాలని కోరుతున్నారు. జిల్లాలోని భీమవరం, ఉండి, పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో 1.26 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. కోస్తా ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) మార్గదర్శకాల మేరకు ఆక్వా జోన్‌లోని రైతులకు మాత్రమే ప్రభుత్వ లబ్ధి చేకూరుతోంది. గతంలో కొద్ది విస్తీర్ణం మాత్రమే జోన్ పరిధిలో ఉండడటంతో చాలా మంది రైతులకు లబ్ధి అందేదికాదు. గత ప్రభుత్వంలో ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో చాలా మంది రైతులకు లబ్ధి చేకూరింది.

కూటమి రైతుల్లోనూ అసంతృప్తి

విద్యుత్ సబ్సిడీ మంజూరులో జాప్యంపై కూటమికి చెందిన నాయకులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ, ఆక్వా రైతు సంఘం నేత మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎన్నికల వాగ్దానాన్ని త్వరితగతిన అమలుచేయాలని, అవసరమైతే ఈ అంశాన్ని తమ పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఆక్వా రంగాన్ని సిండికేట్ దోపిడీ నుంచి కాపాడాలని, మేత ధరలు తగ్గించి, రొయ్య రేట్లు పెంచాలని కోరుతూ పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో పంట విరామానికి పిలుపునిచ్చిన జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అందరికీ రాయితీ విద్యుత్‌ను అమలుచేయాలని కోరుతోంది.

అందరికీ ఇవ్వాలి



ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా రొయ్యలు, చేపల రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50కు ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. దీంతో చాలా మంది రైతులు నష్టాల బారిన పడుతున్నారు. రొయ్యలకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రతి ఒక్క రొయ్య, చేప రైతులకు రూ.1.50కు విద్యుత్ సరఫరా చేయాలి.

– చవ్వాకుల సత్యనారాయణమూర్తి, ఆక్వా రైతు, తోలేరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యం

ఆక్వా రంగానికి పెద్దపీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ–ఫిష్ సర్వే ద్వారా 10 ఎకరాలలోపు రైతులకు చెందిన చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చింది. దీంతో జిల్లాలో ఆక్వా జోన్ పరిధిలోని చెరువులు 1,16,257 ఎకరాలకు పెరిగాయి. జోన్‌లోని 13,648 విద్యుత్ కనెక్షన్లను క్రమబద్ధీకరించి సబ్సిడీపై రూ.1.50లకే విద్యుత్‌ను అమల్లోకి తెచ్చింది. ఆక్వాకు అనుబంధ హేచరీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు తదితర వాటికి నిరంతర విద్యుత్ సరఫరా, కనెక్షన్ల మంజూరు సులభతరం చేసింది. అప్పడా ఏర్పాటుచేసి హేచరీలు, ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీల ఆగడాలకు చెక్ పెట్టింది. సిండికేట్ మాయాజాలంతో రొయ్య ధరలను పూటకోరకంగా మారుస్తూ రైతుల కష్టాన్ని దోచుకునే పరిస్థితికి అడ్డుకట్ట వేసింది. 10 రోజుల పాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రత్యేక చట్టాన్ని రూపొందించారు. ప్రభుత్వ సహకారంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది.

జిల్లా రైతులపై రూ.2 కోట్ల భారం

జోన్‌తో నిమిత్తం లేకుండా అర్హత కలిగిన ఆక్వా రైతులందరికీ రూ.1.50 రాయితీ విద్యుత్‌ను అందిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలోని నాన్ ఆక్వా జోన్ చెరువులు సుమారు 9,000 ఎకరాల వరకు ఉండగా, వీటిలో 450 వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఎకరా చెరువులో ఆక్సిజన్ సరఫరా నిమిత్తం రెండు ఏరియేటర్లను తిప్పితే నెలకు సుమారు రూ.4,500 వరకు బిల్లు వస్తుంది. జోన్ పరిధిలోని రైతులు ఈ మొత్తంలో రూ.2,250లు చెల్లిస్తే, నాన్ జోన్ పరిధిలోని వారు మొత్తం బిల్లు చెల్లించాల్సి వస్తుంది. 5 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేసే రైతులపై ఈ భారం అధికంగా ఉంది. నాన్ ఆక్వాజోన్ పరిధిలో రైతులపై నెలకు రూ.2 కోట్లకు పైగా అదనపు భారం పడుతోందని అంచనా. కూటమి పాలనలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రాయితీ విద్యుత్ రాకపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది. త్వరితగతిన హామీ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

భీమవరంలో తిరంగా ర్యాలీ



బైక్ ర్యాలీలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం భీమవరంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ప్రపంచ దేశాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడారు. పట్టణంలో విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి అల్లూరి సీతారామరాజు స్మృతివనం వరకు ర్యాలీ సాగింది. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: భీమవరంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అధికారులు, సిబ్బంది కార్యాలయ ఆవరణలోని చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రతను నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని వీడాలని కోరారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, ఏఆర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) డి.సురేష్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 19 నుంచి ప్రారంభించనున్నట్టు ఏలూరు జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి మూల్యాంకన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సంస్కృతం, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టుల జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తారన్నారు. ఆయా సబ్జెక్టులకు నియమించిన చీఫ్ ఎగ్జామినర్లు, ఎగ్జామినర్లు సోమవారం ఉదయం 10 గంటలకు, స్క్రూటినైజర్లు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు శిబిరం వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

చింతలపూడి: విధుల్లో నిర్లక్ష్యం వహించిన చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని పాత చింతలపూడి సచివాలయ కార్యదర్శి కె.గంగాభవానీని అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హౌస్ హోల్డ్స్ జియో ట్యాగింగ్ విషయంలో అలసత్వం వహించడంతో పాటు, జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరవడం తదితర అంశాలపై సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇద్దరు గ్రామ కార్యదర్శులపై..

సాక్షి టాస్క్‌ఫోర్స్: హౌస్‌హోల్డ్ సర్వేపై నిర్లక్ష్యం వహించిన కారణంగా జిల్లాలో ఇద్దరు గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు గ్రామ, వార్డు సచివాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ సిఫార్సు చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో జిల్లాలోని భీమడోలు గ్రామ కార్యదర్శి కేవీ లక్ష్మీ తనూజ, టి.నరసాపురం గ్రామ కార్యదర్శి ఉన్నట్టు సమాచారం. దీనిపై భీమడోలు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల్లో 4,009 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫస్టియర్ జనరల్ పరీక్షలకు 3,413 మందికి 3,184 మంది, ఒకేషనల్ పరీక్షలకు 443 మందికి 151 మంది హాజరయ్యారు.

ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఈఓ మానికల రాంబాబు, ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, కుమారాచార్యులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. జస్టిస్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వాదం అందజేసి స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రాలు అందించారు. జంగారెడ్డిగూడెం సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజేశ్వరి తేజస్వి, భీమడోలు మెజిస్ట్రేట్ ఎస్.ప్రియదర్శిని ఉన్నారు.

మద్దిలో.. గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈఓ ఆర్వీ చందన మర్యాదపూర్వక స్వాగతం పలికి ప్రత్యేక పూజకు ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నారసింహుని సేవలో..

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి


తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రజలంతా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలనపై చర్చించుకుంటున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ పట్టణ కమిటీ ఏర్పాటుపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయపోవడంపై ప్రజలు చీదరించుకుంటున్నారని గుర్తుచేశారు. జగన్ పారదర్శక పాలన అందించారని చంద్రబాబును నమ్మి మోసపోయామంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. గతంలో ఏడాదికి రెండు, మూడుసార్లు అర్హులకు ఏదోక పథకం రూపంలో డబ్బులు అందేవని, ఇప్పుడు పెంచిన రూ.వెయ్యి పింఛను తప్ప మిగిలిన పథకాలు ఏమీ అమలుచేయకపోవడంతో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లలేక ఇళ్లకే పరిమితమవుతున్నారని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యేల ఇళ్లను ప్రజలు ముట్టడించే పరిస్థితి వస్తుందని దుయ్యబట్టారు. శ్రేణులంతా పార్టీ బలోపేతానికి పాటుపడాలని, పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరిని గుర్తుపెట్టుకుంటానని అన్నారు.

వచ్చేవి మంచి రోజులు

జగన్ హయాంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుందని, ముఖ్యంగా మహిళలు సంక్షేమ లబ్ధితో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని బలోపేతం అయ్యారని ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులను దాడులు, కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలవుతుందని, రానున్న రోజులన్నీ మంచి రోజులేనని స్పష్టం చేశారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని, జగన్ చేసిన మంచిని ప్రజలకు తెలియజేస్తూ కూటమి అక్రమాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ పట్టణ కమిటీ ఎన్నికపై నాయకులు కసరత్తు చేశారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, మెహర్ అన్సారీ, బెజ్జవరపు హేమశ్రీ, నూకల కనక దుర్గ, మంగెన సూర్య, నత్తా కృష్ణవేణి, చోడే గోపీకృష్ణ, కారుమంచి యోహాన్, పెనుమాక రాజేష్, కర్రి గంగాధర అప్పారావు, కొత్తపల్లి చరణ్, లారెన్స్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌కు సర్వం సిద్ధం

- 19 నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో..
- 21 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు
- జిల్లాలో మూడు కేంద్రాల ఏర్పాటు
- 6,865 మంది విద్యార్థుల హాజరు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పూర్తిచేసి 2025–26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీఈఏపీ సెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా నుంచి 6,865 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకూ మరో సెషన్‌లో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు జరుగుతాయి.

6,865 మంది విద్యార్థులు

ఏలూరు జిల్లా నుంచి 6,865 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో ఇంజనీరింగ్ కోర్సులకు 4,863 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు 1,991 మంది, ఈ రెండు కోర్సులకు 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను కేటాయించారు. వీటిలో ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి.

జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలు, సీట్లు

కళాశాల	సీట్లు
ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్	1,200
ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్	900
ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల	600
హేలాపురి కళాశాల, ఏలూరు	360
ఎస్ఆర్ఐ కళాశాల, ఆగిరిపల్లి	1,360
సారథి ఇంజనీరింగ్ కళాశాల, నూజివీడు	420

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు



ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెల్‌లనూ అనుమతించరు. పరీక్షా కేంద్రానికి వచ్చే విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారం, అడ్మిట్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలి. విద్యార్థులు ఒక గంట ముందుగానే వారికి కేటాయించిన కేంద్రాల్లో రిపోర్ట్ చేయడం ఉత్తమం.

– పి.బాలకృష్ణ ప్రసాద్, ఈఏపీసెట్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్

గూడెంలో భారీ వర్షం



రోడ్డుపై వర్షం నీరు

తాడేపల్లిగూడెం రూరల్/తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలంలో బంగారుగూడెం, పట్టింపాలెం, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, కడియద్ద, చినతాడేపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం 5.30 గంటల నుంచి ఈదురుగాలులు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెదతాడేపల్లిలోని ప్రధాన సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యతో పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలో సరఫరా నిలిచిపోయింది. రాత్రి 7.30 గంటల తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

ప్రైవేట్ టీచర్లకు ప్రవేశాల భారం

- అడ్మిషన్ల టార్గెట్లతో సతమతం
- మండు వేసవిలో ఇంటింటా క్యాంపెయిన్
- జిల్లాలో 563 ప్రైవేట్ విద్యాసంస్థలు
- సుమారు 16 వేల మంది ఉపాధ్యాయులు



భీమవరం: ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్ల పరిస్థితి దయనీయంగా మారింది. యాజమాన్యాలు అడ్మిషన్ల టార్గెట్లు నిర్దేశించి క్యాంపెయినింగ్‌కు పంపడం, పిల్లలను చేర్పించేందుకు ఇంటింటా తిప్పడంపై టీచర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండా ప్రవేశాలు నిషేధం. అయినా కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు వీటిని పట్టించుకోకుండా టీచర్లపై అదనపు భారం మోపుతున్నాయి.

తీవ్ర ఒత్తిళ్లు

వేసవి సెలవుల్లో కొత్త అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులకు టార్గెట్లు విధిస్తున్నారు. టార్గెట్లు పూర్తిచేయకుంటే ఉద్యోగం ఊడుతుందనే ఆందోళనలో మండుటెండల్లో ఊరూరా తిరుగుతూ పిల్లలను చేర్పించేందుకు టీచర్లు శ్రమిస్తున్నారు.

యాజమాన్యాల ఇష్టారాజ్యం

ప్రైవేట్ స్కూళ్లలో పనివేళలు నిర్దిష్టంగా ఉండటం లేదు. కొన్ని విద్యాసంస్థల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉపాధ్యాయులతో పనిచేయిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు అదనపు క్లాసులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీనికితోడు ప్రవేశాల భారం మోపడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

563 స్కూళ్లు.. 1.35 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో సుమారు 563 ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉండగా దాదాపు 1.35 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. సుమారు 16 వేల మంది టీచర్లు, సిబ్బంది పనిచేస్తున్నారు. స్కూళ్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయని, దానికి తగ్గట్టు విద్యార్థుల సంఖ్య లేకుంటే జీతాలు చెల్లించడం కూడా కష్టమని చెప్పి సిబ్బందిని యాజమాన్యాలు బెదిరిస్తున్నట్టు పలువురు వాపోతున్నారు.

తనిఖీలు నామమాత్రం

ప్రైవేట్ స్కూళ్లల్లో మౌలిక వసతులు, సిబ్బంది సమస్యలపై విద్యాశాఖ అధికారులు తనిఖీలు నామమాత్రంగానే చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో వేసవి సెలవుల్లోనే 10వ తరగతి క్లాసులు నిర్వహిస్తున్నా, పబ్లిక్ గానే అడ్మిషన్లు చేస్తున్నా పట్టించుకునే అధికారులు లేరు. అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారని, సమస్యలను తెలియజేస్తే ఉద్యోగాలు ఊడిపోతాయనే భయంలో టీచర్లు ఉన్నారు. ఉన్నతాధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న అడ్మిషన్లు విద్యాబోధన అడ్డుకుని సిబ్బందికి భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు వరాడ సుధీర్

తణుకు అర్బన్ : తుని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన యువకుడు మృతిచెందాడు. తణుకులోని అపోలో ఫార్మసీలో పని చేస్తున్న వరాడ సుధీర్ (32) స్నేహితులతో కలిసి విశాఖపట్టణం నుంచి కారులో వస్తుండగా ఆగి ఉన్న ఇనుప చువ్వల లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనలో సుధీర్‌తోపాటు మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సుధీర్ మృతితో తణుకులో విషాద చాయలు అలముకున్నాయి.

పోక్సో కేసు నమోదు

భీమవరం : బాలికను ప్రేమ పేరుతో మోసం చేసినట్లు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ చెప్పారు. కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన బందెల షాలిమ్ ప్రేమిస్తున్నానంటూ వెంటపడగా ముందు తిరస్కరించింది. కుసుమే ప్రవీణ్‌తో షాలిమ్ రాయబారం నడపడంతో బాలిక ప్రేమకు అంగీకరించింది. షాలిమ్ ఈ ఏడాది జనవరి 16న మాయమాటలు చెప్పి భీమవరం పట్టణంలోని లాడ్జికి తీసుకెళ్లాడు. ఆ విషయాన్ని షాలిమ్ బొండాడ గ్రామానికి చెందిన ఎం.బాలుకు చెప్పడంతో, ఈ ఏడాది మార్చి 27న బాలికను షాలిమ్ తీసుకురమ్మంటున్నాడని చెప్పి అదే లాడ్జికి తీసుకువెళ్లి బాలు బలవంతం చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాళీచరణ్ తెలిపారు.

మంచి సినిమా కథలకు ఆదరణ

సినీ రచయిత అబ్బూరి రవి

భీమవరం (ప్రకాశంచౌక్): సినిమా క్వాలిటీ రేంజ్ పెరిగిందని, మంచి కథలకు ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తుందని సినీ మాటల రచయిత అబ్బూరి రవి అన్నారు. ట్రైలర్‌లు.. సినిమా పోస్టర్లను చూసి ఇది ఓటీటీ.. ఇది థియేటర్ సినిమా అనే చెప్పే పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్రస్తుతం అడవి శేషుతో డెకాయిట్ చిత్రం చేస్తున్న ఆయన శనివారం భీమవరం విచ్చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనది భీమవరమేనని, త్రివిక్రమ్‌తో స్నేహమే సినిమా మాటల రచయితగా మార్చిందన్నారు.

తండ్రిని చంపిన కొడుకు అరెస్టు

దెందులూరు: తండ్రిని చంపిన కొడుకును దెందులూరు ఎస్సై శనివారం అరెస్ట్ చేశారు. మండలంలోని ఉండ్రాజవరం గ్రామంలో అంబల్ల సింహాచలంపై పెద్ద కుమారుడు రోకలిబండతో శుక్రవారం దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సింహాచలం మరో కుమారుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివాజీ వివరించారు.

దిక్కుతోచని పుచ్చ రైతు

- అకాల వర్షాలతో తగ్గిన కొనుగోళ్లు
- ధర పతనమై నష్టాల ఊబిలో రైతులు


తోటలోనే వదిలేసిన పుచ్చకాయలు

నూజివీడు: ఎంతో ఆశతో ఈ ఏడాది పుచ్చ కాయల సాగు చేపట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివిలా మార్కెట్‌లో పరిస్థితులు ఉండటం, వాతావరణం అనుకూలించక పోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. దిగుబడి వచ్చే సమయానికి ధర పతనమవ్వడంతో రైతులు నష్టాల పాలయ్యారు. నూజివీడు మండలంలోని తుక్కులూరు, ముసునూరు మండలంలోని కాట్రేనిపాడులలో దాదాపు 50 ఎకరాల్లో పుచ్చ సాగు చేపట్టగా సాగు చేసిన రైతులందరూ నష్టాల ఊబిలో కూరుకుపోయారు. అకాల వర్షాలతో కాయలు కొనేవారు లేక తోటలోనే కుళ్లిపోవడంతో రైతులు చేసేదేమీ లేక వదిలేస్తున్నారు.

ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి

ఎకరాకు రూ.25 వేల చొప్పున కౌలుకు తీసుకొని సాగు చేసిన పుచ్చ పంటకు ఎకరాకు రైతులు రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడి బాగా వచ్చినా.. సాగు సమయానికి మార్కెట్‌లో టన్ను ధర రూ.11 వేల నుంచి రూ.12 వేల వరకు ఉండగా దిగుబడి సమయానికి రూ.6 వేలకు పడిపోయింది. దీంతో చేసేదేమీ లేక రైతులు అదే ధరకు విక్రయించేశారు. ఐదేళ్లుగా టన్ను రూ.18 వేల నుంచి రూ.20 వేలు పలికింది. దీంతో పుచ్చసాగు చేసిన రైతులు లాభాల బాటలో పయనించారు. ఈ ఏడాది మాత్రం అందుకు విరుద్ధంగా ధర పతనమైంది.

కొంపముంచిన అకాల వర్షాలు

పుచ్చ సాగు ప్రారంభంలో అనుకూలించిన వాతావరణం దిగుబడి రావడం ప్రారంభించాక ఒక్కసారిగా అకాల వర్షాలతో కొంప ముంచేశాయి. ఎకరాకు 15 నుంచి 18 టన్నుల దిగుబడి వచ్చినప్పటికీ అకాల వర్షాలు పడటంతో పుచ్చకాయలు కొనుగోలు చేసే వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న కాయలు కుళ్లిపోతుండటంతో రైతులు చేసేది లేక వదిలేశారు. కొందరు రైతులు కాయలను కోసి వారే నేరుగా ట్రాక్టర్లలో వేసుకొని గ్రామాల్లోకి, పట్టణాల్లోకి వెళ్లి అమ్మినా పెట్టుబడులు రాలేదు. కాలం కలిసి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

రూ. 6 లక్షల నష్టం



ఆరెకరాల్లో పుచ్చ సాగు చేశా. కౌలుతో సహా ఆరెకరాలకు రూ.7.50 లక్షలు పెట్టుబడి అయింది. రూ.6 వేల చొప్పున 25 టన్నులు విక్రయించా. అనంతరం అకాల వర్షాలు పడటంతో కాయ కుళ్లిపోయింది. దీంతో ఆరు లక్షల నష్టం వాటిల్లింది. గతేడాది టన్ను రూ.19 వేల నుంచి రూ.20 వేలు ఉంది. ఈ ఏడాది మాత్రం దారుణంగా పడిపోయింది.

– తల్లిబోయిన రాజగోపాలస్వామి, మర్రికుంట, నూజివీడు మండలం

పెట్టుబడి లక్ష.. వచ్చింది రూ.50 వేలే



15 ఎకరాల్లో పుచ్చ పంట సాగుచేశా. ఎకరాకు పెట్టుబడి రూ.1.10 లక్షలు పెట్టాం. దిగుబడి ప్రారంభమైన నాటి నుంచి టన్ను ధర రూ.6 వేలకు పడిపోయింది. దీంతో పుచ్చకాయలను విక్రయిస్తే ఎకరాకు రూ.50 వేలు మాత్రమే వచ్చాయి. దీంతో దాదాపు రూ.8 లక్షల నష్టం వాటిల్లింది. మార్కెట్‌లో ఈ ఏడాది పరిస్థితి దారుణంగా ఉంది.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు, నూజివీడు మండలం

కొనసాగుతున్న కోకో రైతుల ధర్నా


సోమవరప్పాడు మోండలీజ్ కంపెనీ ఎదుట రెండో రోజు ధర్నా చేస్తున్న కోకో రైతులు

దెందులూరు: కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలని, కంపెనీల మోసాలు అరికట్టాలని, కోకో రైతులను ఆదుకోవాలంటూ రైతులు శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడు మోండలీజ్ కంపెనీ వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ గత రెండున్నర నెలలుగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నా.. కంపెనీలు స్పందించకపోగా కించపరుస్తూ మాట్లాడడం అభ్యంతకరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలన్నారు. దేశీయంగా రైతుకు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోకో రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. రైతుల ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. ఈ నెల 19, 20ల్లో జరిగే చర్చలను బట్టి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుత రామయ్య, సహాయ కార్యదర్శి వీరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ విద్యాసాగర్ మాట్లాడుతూ కోకో రైతులంతా సంఘటితంగా పోరాడాలన్నారు. ఎంతో కష్టపడి రైతు ఉత్పత్తి చేస్తున్న కోకో గింజలకు తగిన ధర ఇవ్వకుండా ఒక్కొక్క కంపెనీ ఒక్కొక్క ధర అమలు చేస్తూ రైతులను మోసం చేసి భయపెట్టి కోకో గింజలు కొనుగోలు చేయడం తగదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌మాట్లాడుతూ కోకో రైతులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. రైతుల దీక్షలతో మోండలీజ్ వద్ద పోలీసుల్ని మోహరించారు. కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్, రైతుల సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. రెండు మూడ్రోజుల్లో ధర నిర్ణయంపై కంపెనీ యాజమాన్యం చర్చలకు వస్తుందని, ఆందోళన విరమించాలని కోరారు. అప్పటి వరకు కంపెనీ కార్యకలాపాలు నిలుపుదల చేయాలని రైతు సంఘాల నాయకులు కోరగా మేనేజర్ అంగీకరించారు. కంపెనీతో పాటు మిగిలిన కంపెనీలు కూడా తమ గోడౌన్లలో ఉన్న సరుకు బయటకు పంపకుండా కంపెనీల కార్యకలాపాలు నిలుపుదల చేయాలని అన్ని కంపెనీలకు సమాచారం ఇచ్చారు

కూటమి నాయకుల మధ్య మట్టి రగడ


కొయ్యలగూడెం మండలం కన్నాపురం సమీపంలోని ఇటుక బట్టీ వద్ద నిల్వ చేసిన చెరువు మట్టి

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల నుంచి నిర్వహిస్తున్న మట్టి తోలకాలు కూటమి నాయకుల మధ్య రగడ సృష్టిస్తున్నాయి. శనివారం సరిపల్లి గ్రామంలో కూటమిలోని రెండు పార్టీల నాయకులు సమీపంలోని చెరువు నుంచి మట్టితోలకాలకు అనుకూలంగా ఒక వర్గం, వ్యతిరేకంగా మరో వర్గం ఘర్షణకు దిగారు. మే 16న రాత్రి దిప్పకాయలపాడు దళితవాడలో రాత్రి వేళల్లో మట్టి రవాణా గురించి స్థానికులు అభ్యంతరం తెలిపి ఆందోళన చేపట్టారు. లారీలను ఆపి అడ్డుకున్నారు. చెరువుల నుంచి చేస్తున్న మట్టితోలకాలు నిబంధన ప్రకారం వ్యవసాయ భూముల అభివృద్ధికి వినియోగించాల్సి ఉన్నప్పటికీ కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోని బేస్‌మెంట్లకు, ఇటుక బట్టీలకు, లేఅవుట్ల స్థలాలకు వినియోగిస్తున్నా కూడా అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మట్టి రవాణా వాణిజ్య అవసరాలకు వాడుతున్నారని కూటమి నాయకులలోని ఒక వర్గం అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను వివరణ అడగ్గా వాణిజ్య అవసరాలకు మట్టి వెళ్తున్నట్లు ఏవిధమైన ఆధారాలు లేవని పేర్కొన్నారు.

ఇలాగైతే విద్యారంగం నిర్వీర్యమే

పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియపై ఉపాధ్యాయుల ఆగ్రహం


భీమవరం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్

భీమవరం : రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో విద్యా రంగం నిర్వీర్యమయ్యే ప్రమాదముందని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ పేరుతో గందరగోళానికి తెర తీశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం కారణంగా ప్రాథమిక విద్యపై తీవ్ర ప్రభావం పడుతుందని, మిగులు ఉపాధ్యాయులు పెరిగి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ విధానాన్ని తొలగించి మోడల్ స్కూల్ విధానం అమలు చేసేందుకు సిద్ధమైంది. పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో కొత్త విధానానికి తెర తీసింది. తొమ్మిది రకాల పాఠశాలలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యలతో మిగులు ఉపాధ్యాయ పోస్టులు పెరిగి, ప్రాథమిక విద్యకు విఘాతం ఏర్పడుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలలను ఎత్తివేయాలని భావించింది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో వెనకంజ వేసింది. యూపీ స్కూల్స్ యథావిధిగా కొనసాగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో ఇప్పటికే సుమారు 1,156 వరకు ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. జిల్లాలో దాదాపు 1,423 స్కూల్స్ ఉండగా వీటిలో దాదాపు 3,800 మంది ఉపాధ్యాయుల్ని బదిలీ చేయాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయుల నియామకాలు ఇలా..

- ఫౌండేషన్ స్కూల్స్ (1–2వ తరగతి, 1–30 మంది విద్యార్థులకు 1 ఎస్జీటీ, 31–60 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలు)
- ప్రైమరీ స్కూల్ (1 నుంచి 5వ తరగతి వరకు 20 మందికి ఒక ఎస్జీటీ, 60 మందికి ఇద్దరు ఎస్జీటీలు)
- మోడల్ ప్రైమరీ స్కూల్స్(1 నుంచి 5వ తరగతి వరకు 59 మంది విద్యార్థులకు ముగ్గురిని, 150 మంది విద్యార్థులకు 4 ఉపాధ్యాయులను నియమిస్తారు.
- అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో 1–10 విద్యార్థుల వరకు స్కూల్ అసిస్టెంట్, 11 నుంచి 30 వరకు ఇద్దరు, 31 నుంచి 140 వరకు నలుగురు, 141 నుంచి 175 మంది విద్యార్థులకు ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తారు.

ఇలాగైతే ఉద్యమం తప్పదు



రాష్ట్ర ప్రభుత్వం అనుచరిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదముంది. ప్రతి గ్రామంలో ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5వ తరగతి వరకు స్కూల్ ఉండాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యలో సంబంధం లేకుండా ఇద్దరు టీచర్స్ ఉండాలి. హైస్కూల్స్‌లో 45 మంది కంటే ఎక్కువ ఉంటే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలి. మా డిమాండ్ల పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు.

– జి.ప్రకాశం, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, భీమవరం

యథేచ్ఛగా గ్రావెల్ రవాణా


పోలవరం గట్టు నుంచి టిప్పర్లతో తరలిస్తున్న గ్రావెల్

సాక్షి టాస్క్‌ఫోర్స్: యథేచ్ఛగా టిప్పర్లతో పోలవరం కాలువ నుంచి గ్రావెల్ రవాణా చేస్తున్నారు. దెందులూరు మండలం చల్ల చింతలపూడి గ్రామంలో బ్రిడ్జి పక్కన పోలవరం గట్టును తవ్వి టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్న ప్రభుత్వ అధికారులు స్పందించకుండా మౌనంగా ఉన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఈ తతంగం జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదకరంగా ఇసుక తవ్వకాలు


జల్లేరు వాగులో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని ప్రధాన కాలువల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. వంతెనలు, కల్వర్టులు, కట్టడాలు సమీపంలో ఇసుక తవ్వకూడదనే నిబంధన ఉన్నప్పటికీ అవి పట్టడం లేదు. జల్లేరు గ్రామంలోని జల్లేరు కాలువపై నిర్మించిన వంతెన సమీపంలో ఇసుక తవ్వేయడంతో వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డాబా పైనుంచి పడి వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలో నిద్రలో డాబా పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై శుభ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అడవినెక్కలానికి చెందిన అద్దేపల్లి దుర్గారావు(45) కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి డాబాపై పడుకున్నాడు. నిద్రపోతూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గారావు చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. దుర్గారావుకు కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కొండచిలువ హల్‌చల్



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం తాడిపూడి కాలువలో జంగిల్ క్లీనింగ్ చేస్తుండగా, శనివారం కొండ చిలువ ఉపాధి హామీ పథకం శ్రామికుడి కాళ్లు, నడుమును చుట్టేయడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. మిగతావారు కొండ చిలువను విడదీసి అతనిని కాపాడారు. ఈ పెనుగులాటలో ఇద్దరికి చేతులు విరిగినట్లు సమాచారం. అనంతరం కొండ చిలువను హతమార్చారు.

పారిజాతగిరిపై బ్రహ్మోత్సవ శోభ

19 నుంచి ఉత్సవాలకు ఏర్పాట్లు


జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఏరియల్ వ్యూ


జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం : బ్రహ్మోత్సవాలకు పారిజాతగిరి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఈ నెల 19 నుంచి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి ఆలయం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది. క్షేత్ర పురాణం ప్రకారం.. చిట్టియ్య అనే భక్తుడికి వేంకటేశ్వరుడు కలలో కనిపించి జంగారెడ్డిగూడెం ఉత్తరాన కొండల్లో తన పాదాలు వెలుస్తాయని ఆ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించాలని తెలిపారు. చిట్టియ్య అన్వేషించగా, ఉత్తర వైపున ఉన్న 7 కొండలలో 6వ కొండపై పారిజాతగిరి వక్షం కింద స్వామి వారి పాదాలుదున్న శిలను గుర్తించి చిన్న ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి భక్తుల అభీష్టాలు తీర్చుతూ ఆలయం అభివృద్ధి చెందింది. పాడిపంటలు కలిగిన ప్రదేశం కాబట్టి గోకులం అనిని, పారిజాత గిరి వృక్షాలు ఉండడంతో పారిజాత గిరి అని, వేంకటేశుడు కొలువై ఉన్నందున తిరుపతి అంటాడు. అందుకు గోకుల తిరుమల పారిజాతగిరిగా ప్రసిద్ధిగాంచింది. పారిజాతగిరిలో.. కొండ వెనుక వరుసగా ఏడు కొండలు ఉండగా ఒక కొండపై పారిజాతగిరి వాసుడి పాదపద్మాలు అవతరించాయి. దీంతో అప్పటి నుంచి ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. పారిజాతగిరి వాసుడికి ఎదురుగా గరుడకొండ ఉంది.

గిరి ప్రదక్షిణ కోసం రోడ్డు నిర్మాణం

దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తే స్వామి నుంచి వెలువడే శక్తిని భక్తులు గ్రహించి పునీతులవుతారని నమ్మకం. దాత సహకారంతో గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. పారిజాతగిరి ఆరు కొండల చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర దాత గోకరాజు గంగరాజు అందజేసిన రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ తరహా గిరి ప్రదక్షిణ అరుణాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తిలో మాత్రమే ఉన్నాయి. ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం, మే నెలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.



బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన పూజ, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, అబ్బిన దత్తాత్రేయ, రాజన పండు, గొట్టుముక్కల భాస్కరరాజు, అర్జుల మురళి, దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి బ్రహ్మోత్సవాలు

పారిజాతగిరిలో 19వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 20న శేష వాహన సేవ, 21న హనుమంత వాహన సేవ, 22న శ్రీనివాస కళ్యాణం, చంద్ర ప్రభ సేవ, 23న గరుడ వాహన సేవ, 24న వసంతోత్సవం, చక్రస్నానం, 25న శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. 22న స్వామి కల్యాణోత్సవం జరగనుంది. ఆలయ మాడవీధుల్లో అర్చకుల వేద మంత్రాల నడుమ స్వామికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలి.

ఎం.రాంబాబు, ఈవో, పారిజాతగిరి

సూక్ష్మ పోషకాలు బూడిద పాలు

- వరి మోడులను తగలేస్తున్న రైతులు
- ఆపై ఎరువులు, పురుగు మందులు పిచికారి
- పెరుగుతున్న సాగు వ్యయం


తాడేపల్లిగూడెం మండలంలో వరి మోడులను తగులబెట్టిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా వరి మాసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఎక్కువగా యంత్రీకరణ ద్వారా వరి కోతలను రైతులు చేపడుతున్నారు. దీంతో వరి కంకులను కోయగా మిగిలిన మోడులు చేలలోనే ఉంటున్నాయి. అయితే, రైతులు ఈ మోడులకు నిప్పు పెట్టి మంట పెడుతున్నారు. ఈ నేపథ్యంలో భూమిలోని సూక్ష్మ పోషకాలు నశిస్తున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. భూమిలో ప్రధానంగా నత్రజని, భాస్వరం వంటి సూక్ష్మ పోషకాలు మెండుగా లభిస్తాయి. వరి మోడులను తగలేయడం వల్ల అవి భూమిలోనే నశిస్తాయి. ఇలా చేయడం కంటే ఆ మోడులను దుక్కిలో దున్నడం వల్ల అవి చివికి తదుపరి పంటకు పోషకాలుగా మారతాయని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రతీ సీజన్‌లోనూ రైతులకు ఈ మేరకు అవగాహన కలిస్తున్నా అవేమీ పట్టడం లేదు. దీంతో మోడులను తగలేస్తున్నారు. అయితే, తదుపరి సీజన్‌కు మరలా పంట ఏపుగా, ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు, పురుగు మందులు పిచికారి చేస్తూ నేలను నిస్తేజంగా చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమిలో ఎరువులు, పురుగు మందుల శాతం పెరిగి భావితరాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పలువురు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

భూసారాన్ని పెంపొందించాలి



ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించాలి. ఇందుకు వరి మోడులను దుక్కిలోనే దున్నాలి. దీనివల్ల భూమి సారవంతంగా మారుతుంది. తద్వారా ఎటువంటి ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. దుక్కిలో దున్నిన మోడుల ద్వారా సహజంగానే పంటకు కావలసిన పోషకాలు లభిస్తాయి.

– ఆర్ఎస్. ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, తాడేపల్లిగూడెం

రోజువారీ కూలి పెంపునకు డిమాండ్


పాలిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అత్తిలి: ఉపాధి శ్రామికులకు రోజువారి కూలి పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అత్తిలి మండలం పాలి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, అందులో భాగంగానే ఉపాధికి కేటాయించిన నిధులను దారి మళ్లించి దేవాలయాలు, కోనేర్లు, భూస్వాముల పొలాల్లో పండ్ల తోటలు, ఉద్యాన వనాల కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు . ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి ఉపాధి హామీని పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దాయం వెంకన్న, టి.ఎల్ వెంకటేశ్వరరావు, సికిలే మంగతాయారు. ధనలక్ష్మి, మరియమ్మ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల సమస్యలను పరిష్కరించాలి


శ్రామికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వెంకట్రామన్నగూడెం తాడిపూడి కాలువలో పనిచేస్తున్న శ్రామికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ శ్రామికులకు గత ఏడెనిమిది వారాలుగా వేతనాలు రావడం లేదని వాపోయారన్నారు. వేతనాలు చెల్లించకుంటే శ్రామికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పని ప్రదేశంలో శ్రామికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

29 నుంచి గోగులమ్మ జాతర మహోత్సవాలు


శ్రీ గోగులమ్మ తల్లి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కడకట్ల గ్రామ దేవత గోగులమ్మ తల్లి జాతర 29నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం అమ్మవారి పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. 11రోజుల పాటు జరిగే జాతరలో అమ్మవారికి విశేష పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువగళం పాదయాత్ర సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌చే రాష్ట్రంలోని యువతకు, విద్యార్థులకు ఇచ్చిన అన్ని హామీలు తక్షణమే అమలు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని, విద్యాహక్కు చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలన్నారు. తల్లి వందనం రూ.15 వేలు నేటికి దిక్కు లేదన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమైనట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జాన్ రాజు, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షురాలు షర్మిల, వి.గగన్ కుమార్, శ్యామ్ సుందర్, ధీరజ్, జాన్‌పాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పెంటపాడు మిడ్‌లెవిల్ కాలువ వద్ద పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పెంటపాడు: పెంటపాడు గ్రామానికి చిరకాల వాంఛగా ఉన్న అపరకర్మలు, షవర్‌బాత్‌లకు సంబంధించి పనులను శనివారం సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ప్రారంభించారు. కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను ఎంపీటీసీ సభ్యురాలు దేవాబత్తుల నాగమణి, ఎస్సీ నాయకులు ఈశ్వరరావు, బాబి, జనసేన నాయకులు కశిరెడ్డి మధులత, కన్నయ్య, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, జనసేన నాయకులు కొవ్వూరి లక్ష్మణరెడ్డిలు మాట్లాడుతూ పలువురు మృతి పొందిన సమయంలో అపరకర్మలు చేసుకోవడంతో పాటు, స్నానం చేసి వెళ్లేందుకు షవర్ బాత్‌లు, చితా భస్మాన్ని పుణ్యనదులలో కలిపేందుకు వీలుగా బూడదను భద్రపరచుకొనేందుకు వీలుగా గదులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు దాతలు సహకరించాలన్నారు.

అభివృద్ధిలో డిజిటల్ టెక్నాలజీ పాత్ర కీలకం

భీమవరం (ప్రకాశంచౌక్): దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని టెలిఫోన్ జేటీవో పులి సాయిబాబా అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం ఎడ్వార్డ్ ట్యాంక్ వద్ద బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ కార్యాలయంలో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పురాతన ఆధునిక టెలిఫోన్ చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడం , మారుమూల ప్రాంతాలకు వైద్య సదుపాయాలు తదితర సమస్యలను అందించడంలో సమాచార సాంకేతిక వ్యవస్థ కీలంకంగా వ్యవహరిస్తుందని సాయిబాబా తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత


తణుకు ఆర్టీసీ డిపోలో కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ వీరభద్రరావు

తణుకు అర్బన్ : వేసవి దృష్ట్యా ఆర్టీసీ కార్మికులు ఆరోగ్య భద్రత పాటించాలని భద్ర ఈఎన్‌టీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ కాసగాని వీరభద్రరావు అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో శనివారం కార్మికులు, గ్యారేజి సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి వేడిమిలో తీవ్ర అస్వస్థతకు గురైన సందర్భంలో కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది సౌకర్యార్థం డాక్టర్ వీరభద్రరావు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయడం అభినందనీయమని అన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్ వాజపేయాజుల శివ కుమార్, తేజ ఫ్లెక్స్ యజమాని ఇందుగమిల్లి సాయినాథ్ మహరాజ్, గ్యారేజీ, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం..


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రాధాకృష్ణ తదితరులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని అందరి సహకారంతో అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం తణుకు ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి సంఘం సమావేశం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతను భర్తీ చేస్తామని చెప్పారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ పేషంట్లకు బెడ్లను 10 నుంచి 15 వరకు పెంచడం జరిగిందని, కంటి విభాగాన్ని, తల్లి పిల్లల విభాగాన్ని, ఫిమేల్ వార్డులను పరిశీలించి ఆసుపత్రి సూపరింటెండెంట్ పలు ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలో నిర్మాణం చేసిన భవనంపైభాగంలో ప్లాస్టరింగ్ చేయకపోవడాన్ని తీవ్రంగా స్పందిస్తూ ఏపీఎంఐడీసీ ఇంజీర్లపై ఆగ్రహం వ్యక్తంచేసి తణుకు, ఆకివీడు ఆస్పత్రి భవనాలపై పనులు పూర్తిస్థాయిలో చేసి 15 రోజుల్లో నివేదికలు అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీబ్ కౌసర్ భానో, డీసీహెచ్ఎస్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతా బాయి, ఆర్ఎంవో డాక్టర్ ఎల్ సాయి బాలాజీ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, కమిటీ సభ్యులు కాన్‌రాజ్, డాక్టర్ అయేషా ఖాన్, కే. కిరణ్మయి, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు వెళ్లిన తణుకు ఆర్టీసీ బస్సు


తణుకు ఆర్టీసీ బస్సులో సరస్వతీ పుష్కరాలకు వెళ్తున్న భక్తులతో డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: పవిత్ర సరస్వతీ పుష్కరాల కోసం తణుకు ఆర్టీసీ డిపో నుంచి శనివారం ప్రత్యేక బస్సు బయలుదేరినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్‌తెలిపారు. తణుకు డిపోనుంచి సరస్వతీ పుష్క రాలకు శనివారం మొదటిగా బయలుదేరిన బస్సు ను ప్రారంభించి మాట్లాడారు. కాళేశ్వరంలో మహా వైభవంగా ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్క రాలకు పుష్కర స్నానాల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తణుకు డిపో టు ప్లస్ టు పుష్ బ్యాక్ సీట్లతో సరికొత్త వీడియో కోచ్ సూపర్ లగ్జరీ బస్సు కాళేశ్వరం సరస్వతి నది పుష్కర యాత్రా స్పెషల్ రాత్రి7 గంటలకు తణుకు నుంచి బయలుదేరినట్లు చెప్పారు. 18వతేదీ ఉదయం వరంగల్ భద్రకాళి మాత సందర్శనం అనంతరం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దర్శనం, కొండగట్టు ఆంజనేయ స్వామి సందర్శనాంతరం ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహస్వామివారి ఆలయ దర్శనం, 19న ఉదయం కాళేశ్వరంలో మహాకాళేశ్వరుని దర్శనం పవిత్ర పుష్కర స్నానం తదుపరి రామప్ప దేవాలయ దర్శనంచేసుకుని 20వ తేది తెల్లవారుజామున తణు కు చేరుకుంటుందని వివరించారు. టికెట్‌చార్జీ ఒక్కొ క్కరికి రూ.2100లుగా నిర్ధేశించినట్లు చెప్పారు. ఈ నెల 22న సరస్వతీ నది పుష్కరయాత్రా స్పెషల్ బస్ బయలుదేరుతుందని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యంకూడా ఏర్పాటు చేయడమైనదని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులు పరిష్కరించాలి


తణుకు కోర్టులో సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: జూలై 5వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలలో అధికసంఖ్యలో కేసులు రాజీచేసేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. తణుకు కోర్టులో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌తోపాటు ప్రతి రోజు కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌ల ద్వారా కేసులు రాజీ చేస్తునట్లుగా చెప్పారు. సివిల్ కేసులకు సంబంధించి కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణవేణి, బెంచ్ మెజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, వివిధ పోలీసు స్టేషన్‌ల ఎస్సైలు, ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై ముగ్గురి దాడి

ఉండి: వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం మహదేవపట్నం బొక్కావారి పాలెం ప్రాంతానికి చెందిన జుత్తిగ దుర్గాప్రసాద్, అదే ప్రాంతనికి చెందిన కవురు దుర్గామల్లేశ్వరరావుకు స్థానికంగా దుర్గమ్మగుడి నిర్మాణ సమయంలో గొడవలు తలెత్తాయి. వీటిని స్థానిక పెద్దల సమక్షంలో పరిష్కరించుకున్నారు. నాటి నుంచి దుర్గామల్లేశ్వరరావు దుర్గాప్రసాద్‌ను వంకలు పెట్టి తిడుతూనే ఉన్నాడు. దీనిపై గత నెల 25న మళ్లీ పెద్దల సమక్షంలో పరిష్కారానికి సిద్ధమయ్యారు. ఆ సమావేశంలో దుర్గామల్లేశ్వరరావు తనతో ఉండే మరో ఇద్దరు వ్యక్తులు తనను కొట్టి చంపుతామని బెదిరించినట్టు దుర్గాప్రసాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సందడిగా వేసవి శిక్షణ శిబిరాలు


గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం


అత్తిలి : విద్యార్థులతో నీతికథలు చదివిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి సెలవులను చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. పట్టణంలోని గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరం బాల బాలికలచే నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే ఆటల, పాటలు, పంచతంత్ర కథలు, చెప్పారు. కోపల్లె శ్రీనివాస్‌రావుచే దేశభక్తి గీతాలు, పుస్తక సమీక్ష, ఎ.జనార్ధనరావుచే పొడుపు కథలు, లెక్కలలో టిప్స్ చెప్పారు. జి.బాపయ్య శర్మచే ఇంగ్లీషు గ్రామర్, ఆర్.నాగేంద్ర కుమార్‌చే సైన్సు అంశాలు చెప్పారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థి దశనుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు చదివించారు. దేశభక్తి గీతాలను నేర్పించారు. రిటైర్డు టీచర్ కె వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. విద్యార్థులు సమయపాలన, ఒత్తిడిని జయించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బి రాము, జి రవిశంకర్, పి వెంకటేశ్వరరావు, ఆర్ దానకృష్ణ, జి శేషవేంద్రరావు, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

సండేస్కూల్ టీచర్లకు శిక్షణ తరగతులు


సమావేశంలో శిక్షణ అందజేస్తున్న నిర్వాహకులు

పెంటపాడు: గూడెం కడకట్ల ఫ్లెటోవర్ బ్రిడ్జి సమీపంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సండేస్కూల్ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గాడ్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ తరగతులో హైదరాబాద్‌కు చెందిన జె–127 సంస్థ ప్రతినిధి గాబ్రియేల్, నవుడూరుకు చెందిన ప్రకాష్, కృపావాణి ఎడిటర్ బాబు, పాస్టర్ స్టాన్లీ, బ్రదర్ పవన్ కుమార్, క్రాంతి కుమార్, సత్యప్రకాష్, ఇజ్రాయేలురాజు తదితరులు ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరిగింది. మూడు సంవత్సరాలకు సంబంధించి సండేస్కూల్‌కు ఉపయోగపడే పుస్తకాలు అందజేశారు. జిల్లాలోని సండేస్కూలు టీచర్లు, పలు సంఘాల దైవసేవకులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


చిన్నారులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: వేసవిలో చిన్నారులు, పెద్దలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఏఎస్ఆర్ హోమియో సహాయ ఆచార్యులు డాక్టర్ సురేంద్ర కుమార్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాలలో శనివారం సేవాకార్యక్రమాలలో భాగంగా చిన్నారులకు సూర్యతాప్ మాత్రలను పంపిణీ చేశారు. కళాశాల నిర్వాహకులు ఆకుల విజయవర్ధన్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రత్తిపాడుతో పాటు, గూడెంలో హోమియో మాత్రలు పంపిణీ చేశామన్నారు.

నేడు బీవీఆర్‌లో నెలవారీ సంగీత, నృత్య సాహితీ సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక, సమా హారం ఏర్పాటు చేశారు. ఆశోక్ ఈవెంట్స్ వారిచే నృత్య ప్రదర్శనలు, నాయకురాలు కసిరెడ్డి మధులతకు గౌరవ సేవా పురస్కారం, ఢీ డాన్స్ విన్నర్ మహాశివభట్ల అశోక్ కుమార్‌కు కళా పురస్కారం, ఉద్యోగ సేవా పరిష్కారం పోలు కొండ శివకుమార్‌కు, పేద కళాకారుడుకు ఆర్థిక సత్కారం చేయనున్నారు. సభాధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ రమణారావులు పర్యవేక్షించనున్నారు. కళాకారులు, అభిమానులు,హాజరుకావాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

తణుకు అర్బన్: మన ఇంటిలానే బయటి ప్రదేశాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి సూచించారు. తణుకులో శనివారం జరిగిన 'హిట్ ద బిట్' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు.

స్వచ్ఛ ఆంధ్రకు ప్రజలంతా సహకరించాలి


మాధవరం సచివాలయం వద్ద మొక్కలు నాటి, నీరు పోస్తున్న ఎంపీడీవో ఎం. విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. స్వచ్ఛ భారత్ – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మాధవరం గ్రామంలో ఉపాధి శ్రామికులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఉప సర్పంచ్ బండారు నాగరాజు, కార్యదర్శి బి.ఫణికుమార్, ఎంఆర్‌సీ ఎం .రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రజలందరి బాధ్యత

పెంటపాడు: పరిసరాల పరిశుభ్రత ప్రజలందరూ బాధ్యత తీసుకోవాలని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యకళ మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి రైస్ మిల్లులో శనివారం స్వచ్ఛంధ కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సైలు మురళీమోహనరావు, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని తణుకు కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో మొక్కల నాటినట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్. మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం (వెంకట్రామన్నగూడెం)లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. బీట్ ద హీట్ అనే థీమ్ ద్వారా కొన్ని హెచ్చరికల వ్యవస్థలను ఏర్పాటు చేయడం, క్లే పాట్ స్టేషన్ ఏర్పాటు, మొక్కలు నాటడం, పచ్చని ప్రదేశాలు, చల్లని కాలి బాటలు, పై కప్పు భాగంలో తోట పని, చల్లని పై కప్పులను ఏర్పాటు చేయడం, ఆకుపచ్చ భవనాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్‌చే పరిసరాలు పరిశుభ్రత కోసం నా వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీపై అవగాహన కల్పించారు. వేసవి తీవ్రతలు తగ్గేందుకు తప్పక మొక్కలు నాటాలని, పర్యావరణంను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.


పెంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ స్వరాజ్యలక్ష్మి